క్లుప్తంగా

నేడు 'రైతు నేస్తం'

బంట్వారం: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ బుగ్గాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించనున్నట్లు కోట్‌పల్లి వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సందేశమిస్తారని చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కాన్ఫరెన్స్‌కు రైతులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్క ధరఖాస్తు కూడా రాలేదు. బంట్వారం, కోట్‌పల్లి ఎంపీడీఓలు రాములు, డానియల్ ఇతర అధికారులు వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యల అర్జీలు సమర్పిస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శులకు రిలీవ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఎట్టకేలకు రిలీవ్ అయ్యారు. కోటబాసుపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రావణి యాలాల మండలం రాఘవపూర్‌కు, ఉద్దాండపూర్ నుంచి కోటబాసుపల్లికి నాగప్రసాద్, చంద్రవంచ సెక్రటరీ శివకుమార్ ఉద్దాండపూర్‌కు, చంద్రవంచకు యాలాల మండలం దేవనూర్ నుంచి సంధ్యారాణి వచ్చారు. అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ బషీరాబాద్ మండలం క్యాద్గీర్‌కు, బషీరాబాద్ మండలం బోజ్యనాయక్ తండా కార్యదర్శి అరుణ అల్లాపూర్‌కు బదిలీ అయ్యారు. చెంగోల్ పంచాయతీ కార్యదర్శి సుజీత్‌కుమార్ బిజ్వార్‌కు ఇక్కడ పనిచేస్తున్న అశోక్ కుమార్ చెంగోల్‌కు బదిలీపై వెళ్లారు. సెప్టెంబర్‌లో కలెక్టర్ పలువురి కార్యదర్శులను బదిలీ చేశారని.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీలు నిలిపివేశామని.. సోమవారం బదిలీల ప్రక్రియ చేపట్టామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. పలువురు కార్యదర్శులు తమను వెంటనే రిలీవ్ చేయాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఎంపీడీఓకు ఒత్తిడి పెంచినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రాకపోకలు షురూ



కుదరుమల్ల-దౌల్తాబాద్ తాత్కాలిక రోడ్డు

దుద్యాల్: మండల పరిధిలోని కుదరుమల్ల–దౌల్తాబాద్ మార్గంలో తాత్కాలిక రోడ్డును సోమవారం పునరుద్ధరించారు. కుదురుమల్ల సమీపంలో పెద్ద వాగు ప్రవహిస్తుంటుంది. దీంతో అక్కడ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్గం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో తాత్కాలిక రోడ్డును పునరుద్దించారు. 20 రోజులుగా నిలిచిన రాకపోకలు ప్రారంభమయ్యాయి.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

తుర్కయంజాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. కార్మికులను పర్మినెంట్ చేసి, పనికి తగిన వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 14,15 తేదీల్లో తుర్కయంజాల్, నీలం సంజీవ రెడ్డినగర్‌లోని చలసాని కల్యాణ మండపంలో నిర్వహించనున్న తెలంగాణ మున్సిపల్ వర్క ర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభల ఏర్పాట్లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భాస్కర్‌మాట్లాడుతూ..ఈ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించనున్నామని తెలిపారు. మున్సిపాలిటీల్లోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, పార్ట్ టైం, ఫుల్ టైం కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. 2వ పీఆర్సీని ప్రకటించి, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సెలవులు, వారాంతపు సెలవులను అమలు చేయాలని పేర్కొన్నారు. చేపట్టనున్న సభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్ర మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, డి.జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు ఇ.నరసింహ, టి.నరసింహ, ఎల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంత.. ఆదమరిస్తే చింత



కుదురుమల్లలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

మండల పరిధిలోని కుదురుమల్ల, హస్నాబాద్ గ్రామాల్లో రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ కాలినడకన వెళ్లే వారు బైక్‌లు, కార్ల వాహనాల్లో ప్రయాణించేవారు అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. గతంలో ఈ గుంతల్లో వాహనాలు ఇరుక్కుని నానా ఇబ్బందులు పడ్డామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– దుద్యాల్



హస్నాబాద్‌లో..

నాలుగేళ్లుగా మూత

- నిరుపయోగంగా శుద్ధ జల కేంద్రాలు
- శిథిలావస్థకు చేరుతున్న వాటర్ ప్లాంట్లు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు



హస్నాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ శుద్ధ జల కేంద్రం

దుద్యాల్: శుద్ధ జల కేంద్రాలు నాలుగేళ్లుగా మూతబడ్డాయి. 2021లో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో ఈ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా పలు గ్రామాల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏడాది పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగాయి.

రూ.5కే 20 లీటర్లు

మండల పరిధిలోని హస్నాబాద్‌లో రెండు, దుద్యాల్, గౌరారం, ఈర్లపల్లి, కుదురుమల్ల, అంసంపల్లి, చిలుముల్ మైల్వార్ గ్రామంలో ఒక్కో శుద్ధజల కేంద్రాలున్నాయి. వీటి ద్వారా గ్రామస్తులకు రూ.5కే 20 లీటర్ల క్యాన్ తాగునీరు అందించేవారు. దీంతో తమకు బయట మార్కెట్‌లో అధికంగా వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేయాల్సిన ఇబ్బంది తప్పిందని గ్రామస్తులు సంబురపడ్డారు. ప్రస్తుతం ఈ ప్లాంట్లు మూతపడడంతో మిషన్ భగీరథ నీటినే తాగాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకుని ప్లాంట్లు వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

> **పునఃప్రారంభించాలి**
>
> 
>
> కుళాయి నీటితో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మినరల్ వాటర్ తాగుతున్నాం. ప్రైవేటు ప్లాంట్లలో అధిక ధరలకు కొనగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. – బండారి నర్సింలు, హస్నాబాద్

శిథిలావస్థకు చేరుతున్న ప్లాంట్లు

కుళాయి నీటిని సేవించడంతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని 2020లో ప్రభుత్వం ప్రతీ గ్రామంలో శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ ఖర్చు గ్రామ పంచాయతీ చూసుకునేది. తరువాత పంచాయతీ కేంద్రాల్లో నిధులు లేవని.. వాటిని నిర్వహించేందుకు అదనపు భారం పడుతుందని నిలిపివేశారు. ప్రస్తుతం ఆ ప్లాంట్లు శిథిలావస్థకు చేరాయని అధికారులు స్పందించి శుద్ధ జల కేంద్రాలను వినియోగంలోకి తీసుకురవాలని కోరుతున్నారు.

రేపటి నుంచి గాలికుంటు టీకా పంపిణీ

పశువైద్యులు శివదుర్గా ప్రసాద్, నాన్సి



సిబ్బందితో మాట్లాడుతున్న పశువైద్యులు శివదుర్గా ప్రసాద్, నాన్సి

తాండూరు రూరల్: పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు పశువైద్య ఏడీఏ కేంద్రంలో అందుబాటులో ఉంటామని యాలాల పశు వైద్యాధికారి డాక్టర్ కె.శివదుర్గా ప్రసాద్, మల్కాపూర్ పశువైద్యధికారి డాక్టర్ నాన్సి అన్నారు. సోమవారం వారు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా పశువైద్యాధికారి సదానందం ఆదేశాల మేరకు తాము తాండూరు ఏడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించామని చెప్పారు. కార్యాలయంలో ఇద్దరు డాక్టర్లతో వెటర్నరీ అసిస్టెంట్ అశోక్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సైదులు, ఆఫీస్ సబార్డినేటర్ ఇమ్రాన్ అందుబాటులో ఉంటారన్నారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు తాండూరు ప్రాంతంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వస్తే 75 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. కాగా ప్రస్తుత ఏడీఏ కేంద్రం శిథిలావస్థకు చేరిందని నూతన భవనం మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కురుమ సంఘం మండల కమిటీ



నియామకపత్రాలతో నూతన కమిటీ సభ్యులు

ధారూరు: కురుమ సంఘం మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కుర్వ నర్సింహులు, గౌరవ అధ్యక్షుడిగా చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌కుమార్, కోశాధికారిగా రాజు, కార్యదర్శులుగా మహేశ్, సంగమేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా సాయిలు, బాల్‌రాజ్, బీరప్ప, సలహాదారులుగా నర్సింహులు, శ్రీశైలం నియమితులయ్యారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



ఎస్‌ఐ మోహనకృష్ణకు విరాళం అందజేస్తున్న మాదారం గ్రామస్తులు

పరిగి: ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ మోహనకృష్ణ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మాదారం గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.1.86లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మోహనకృష్ణ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చన్నారు. వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

ఇబ్బంది పడుతున్న వాహనదారులు



తాండూర్-హైదరాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ధారూరు: తాండూర్–హైదరాబాద్ వయా ధారూరు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. 40 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మార్గంలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అడుగడుగునా గుంతలుండడంతో వాటిని తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతులు చేయించాల్సిన అధికారులు మట్టి పోసి మమ అనిపిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.50 లక్షలతో ఐమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయగా.. సోమవారం పంచాయతీ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిరంతరం పాటు పడుతున్నారని తెలిపారు. ఆయన సహకారంతో మండలంలో రహదారుల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల ఏర్పాటు, సీసీరోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు, క్రీడా మైదానాల అభివృద్ధి, శుద్ధ తాగునీటి సరఫరా తదితర కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, నాయకులు రాజేందర్‌గౌడ్, యాదయ్య, వెంకటేశ్, బుచ్చయ్య, చెన్నమోని కృష్ణ, రాఘవేందర్, చందు, బుద్దురామ్, తిరుమలేశ్ తదితరులు ఉన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడి

వ్యవసాయ గణాంక అధికారి సందీప్



అడవివెంకటాపూర్‌లో మొక్కజొన్న పంట దిగుబడి అంచనా వేస్తున్న సందీప్ రెడ్డి

కుల్కచర్ల: నూతన పద్ధతులతో పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ గణాంక అధికారి సందీప్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చౌడాపూర్ మండలం అడవివెంకటాపూర్ గ్రామంలో విస్లావత్ శంకర్ నాయక్ మొక్కజొన్న పంట దిగుబడిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత అంచనా ప్రకారం మొక్కజొన్న ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అడవిపందుల వల్ల కొంతమేర పంటకు నష్టం వాటిల్లుతుందని అందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సూచించిన సలహాలను రైతులు పాటించాలన్నారు.

ఎంపీడీఓకు ఘనంగా వీడ్కోలు



ఎంపీడీఓ విజయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట: మోమిన్‌పేట ఎంపీడీఓ విజయలక్ష్మి రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఏడాది క్రితం ఆమె కొడంగల్ నుంచి మోమిన్‌పేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయలక్ష్మిని మండల పరిషత్ కార్యాలయం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

క్రీడారంగ అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: క్రీడారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని పట్టణంలోని మినీ స్టేడియంలో ఎమ్మెల్యే పేరిట క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. గత ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. నియోజకవర్గంలో క్రీడాకారులు, కులాలు, మతాలు, ఇతర వర్గాలు అనే తేడా లేకుండా అందరూ ఒక జట్టు సభ్యులమన్నారు. అదేవిధంగా క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. స్టేడియాల నిర్మాణం, క్రీడాకారులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా టోర్నీలో గెలుపొందిన ఫరూఖ్‌నగర్ జట్టుకు రూ.1 లక్ష నగదు పురస్కారంతో పాటు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రఘునాయక్, శ్రీనునాయక్, రవికుమార్ గుప్తా, అన్వర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాతల సహకారాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రామన్నగూడ నుంచి నడుచుకుంటూ వస్తున్న ఆరు మంది విద్యార్థులకు ఆయన సొంత నిధులతో సైకిళ్లు అందజేశాడు. సోమవారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవునిఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలకు పక్కనే ఉన్న రామన్నగూడ వార్డు నుంచి ఆరు మంది విద్యార్థులు నడుచుకుంటూ వస్తున్నారని, రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు గ్రామస్తుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యను గుర్తించి తనవంతు బాధ్యతగా సైకిళ్లు అందించినట్లు స్పష్టం చేశారు. అనంతరం దాత సత్యనారాయణరెడ్డిని గ్రామ నాయకులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు దాత సహకారాన్ని ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్, సభ్యులు రాజిరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, రవీందర్, రాంరెడ్డి, సత్యనారాయణ, శివయ్య, జంగయ్యగౌడ్, గ్రామ యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

ఎస్‌ఐ శిరీష



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శిరీష, సిబ్బంది

చేవెళ్ల: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ వనం శిరీష అన్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టులు వేసుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని రకాల పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపించటం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేసే వారిని గుర్తించి బస్సులు ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు వాహనదారులకు కౌన్సెలింగ్

ట్రాఫిక్ పోలీస్ కేసులలో పట్టుబడిన వాహనదారులకు చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ కేంద్రం అందుబాటులో ఉంటుందని, దీనిని కేసులు నమోదైన వారు సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా పట్టుబడిన కేసుల వాహనదారులు టీటీఐ మాదాపూర్ కౌన్సెలింగ్ కేంద్రాలకు వెళ్లి రావాల్సి ఉంటుందన్నారు. కానీ మంగళవారం ఈ కౌన్సెలింగ్ కేంద్రాన్ని చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో టీటీఐ మాదాపూర్ నుంచి సిబ్బంది వచ్చి నిర్వహిస్తున్నారని తెలిపారు. కేసులలో పట్టుబడిన వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు, ఒక్కరోజే ఈ కౌన్సెలింగ్ సిబ్బంది ఉంటారని తెలిపారు. కేసులు ఉన్న వాహనదారులు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఎంపీ నిధులతోనే అభివృద్ధి పనులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

చేవెళ్ల: గతంలో ఎప్పుడు లేని విధంగా ఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండలంలోని చనువెళ్లి, ఇక్కారెడ్డిగూడ, అల్లవాడ, పలుగుట్ట గ్రామాల్లో సోమవారం ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులు ఉంటాయనే విషయం గతంలో ఎప్పుడు ప్రజలకు తెలిసేదికాదని, కానీ ప్రజా నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా గెలిచిన తర్వాత ఆయన తన ఎంపీ పరిధిలో వచ్చే నిధులను అన్ని గ్రామాలకు కేటాయిస్తూ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు అందించే నిధులతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని వివరించారు. ఈ నిధులతో గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.